కథా నిలయం
శ్రీకాకుళం

# సూర్యుడు తలెత్తాడు

నేటి తెలుగుదేశంలో అదొక మారుమూలపల్లె. క్రుగ్రామం. రావడంటే మనిషి కాదు, మర.

సూర్యుళ్లా పొలంలో పొడిచి, ఇంట్లో కుంకుతుంటాడు. చేనుకి చెమటతో స్నానం చేయించి, నెత్తురుతో బొట్టు పెడుతుంటాడు. పంట చేను పసి పాపల ముత్తయిదువు అయితే పైరును అస్తొరుబస్తంగా చూచుకొంటుంటాడు.

రావడి ముఖం ఊరు చూళ్ళేదు. పల్లె చూళ్ళేదు. పిల్లలు చూళ్ళేదు. పెళ్ళాం చూళ్ళేదు. సూర్యుడు చూళ్ళేదు. పొలం చూసింది.

వంగి పని చేయటం, తలవంచుక నడవటం, ముఖం దాచుకొని నిద్రపోవటం అతడి రివాజు.

రావడి మాట పొలం కూడా విన్లేదు. నిశ్శబ్దం అతడి దినచర్య. జీవిత చర్య.

గుండె గుహలో రాక్షసుడు దాచిపెట్టిన పసివాడి కేక ఒకటి ఉంది. బైటికి వినిపించదు. నలుగురుంటే రావడి గుండె కూడా చప్పుడు చేయదు.

రావడి కళ్ళలో నీళ్ళు లేవు. ఎరుపు లేదు. ఏడుపురాదు. కోపం రాదు. రాయి! ఎండకూ, చలికీ వేడిగా చల్లగా కాదు. రాయి కూడా కాదు, దూది.

రావడి శరీరాన్ని పంచభూతాలు బతికుండగా పంచుకున్నాయి. ఏం పొరపాటు జరిగిందో ఎముకలు మిగిలాయి. మరేమయిందో అవి కదులుతున్నాయి.

ఇంటికి వచ్చేసరికి పల్లెంతా గుబగుబలాడుతూ ఉంది. సీత కల చచ్చిపోయింది ఉరిపోసుకొని. ఎవడో చేయి పట్టుకున్నాడనీ, చెప్పినా వినలేదని – జనం చెవులు కొరుక్కుంటున్నారు.

రావడు ఆ రాత్రి మామూలుగా నిద్రపోయాడు. ఉదయం పొలంలో సూర్యుడు.

రావడు భూమి బిడ్డ. ఆ ఎకరం పొలం అతడి యావదాస్తి.

కాళ్ళు కడుక్కొని కూటికి్కూచుంటే వచ్చి వడ్డించే కూతురి కాళ్ళూ చేతులూ కనబళ్ళేదు. కూడురాలేదు. లేదు అన్న మాటన్నా వినబళ్ళేదు. రావడదేం పట్టించుకోలేదు. నిద్రపోయాడు.

పొయిలో పిల్లి లేవటం లేదు. గింజలున్నట్టే వుంది. పిల్లే ఉన్నట్లు లేదు.

లేచిపోయిందని లేపుకుపోయాడని రెండు మాటలు. పిల్ల దొంగసొత్తు కాలేదన్న నమ్మకం రావడికేముంది?

ఆ మాటకే వస్తే రావడికి ఏం నమ్మకాలున్నాయసలు?

కొండల్లో ఇళ్ళు కట్టారని, పొలాలు ఇస్తున్నారని చాలామంది పల్లెవాళ్ళు వెళ్ళిపోయారు. రావడు పోలేదు.

పొలం పోవడానికి బయలుదేరి ఇంటిముందు మడుగులో పడివున్న కొడుకును చూశాడు. దెబ్బలు! గుండె ఆడుతూ వుంది. చావడు. మొండి ఘటం. గట్టి ప్రాణం.

జనం పోగయ్యారు. ఊళ్ళోవాళ్ళతో పెట్టుకోవద్దురా అంటే వింటాడా? ప్రాణాలకు తెచ్చుకొన్నాడు. ఓపిక ఉన్నవాళ్ళు ఏడుస్తున్నారు. చేతనయినవాళ్ళు ఏమన్నా చేస్తున్నారు.

రావడు మాత్రం అక్కళ్ళేడు. సూర్యుడితోపాటు పొలంలో తిరుగుతున్నాడు.

ఇంట్లో దీపం కొండెక్కింది. కంట్లో దీపం ముసుగులో దాచి, కుక్కిమంచం కబుర్లు వింటున్నప్పుడు గాజులు చప్పుడు, మట్టెల మోత!

ఈ చప్పుడు తనకు తెలుసు. తనదే తన నెత్తురదే! తన గుండెదే!

రావడు నిద్ర లేచాడు. సూర్యుడు అర్ధరాత్రి బయటికి వచ్చాడు.

ఎదురుగా కూతురు! నిండు చూలాలు! కాళ్ళు పట్టుకొంది. తల నిమిరాడు.

ఆ రోజు ఉదయం సూర్యుడు ఇంట్లో ఉదయించాడు. రాత్రి పొలంలో అస్తమించాడు.

పల్లెకు పోయేసరికి ఇల్లు రవందాడిగా ఉంది. పసిగొంతు ఏడుపు. ఆడగోల. మగపిల్లాడు. తల్లిపోయింది.

రావడు మనవణ్ణి చూశాడు. కూతుర్ని చూశాడు. మనవణ్ణీ కూతుర్నీ చూశాడు. ఉదయం అస్తమయం చూశాడు.

మనవణ్ణి పెంచటమన్న మహాయజ్ఞంలో పసివాణ్ణి బలిపశువును చేస్తున్నాడు రావడు.

'ఈడు జచ్చిందాకా నువ్ జచ్చేట్టు లేవం'టూ పక్కింటి గొడ్రాలు మనవణ్ణి మారెమ్మ ఎత్తుకు పోయినట్లు ఎత్తుకుపోయింది.

అపు, కొట్టు, పొడువు, చంపు అనే అరుపులు దూరం నుంచి వినిపించాయి. కర్రలు, కట్టెలు, బొంగులు పుచ్చుకొన్న మనుషులు పొలాలకడ్డంపడి వస్తున్నారు.

పందిని చంపుతున్నారు కాబోలుననుకొన్నాడు రావడు. రొప్పుతూ రోస్తూ నురుగులు కక్కుతూ కొడుకు పరుగెత్తుకొస్తున్నాడు. ఏటుకందలేదు. పొలం వచ్చాడు. తండ్రిని చూశాడు. కాళ్ళమీద పడ్డాడు.

పడ్డవాడు లేవలేదు. కర్రలు లేవనివ్వలేదు.

ఏటుమీద ఏటు. రావడానికీ నాలుగు తగిలాయి. అది మనిషి ఆకారం కాదని మట్టి ముద్దనీ రుజువు అయిందాకా కర్రలు ఆగలేదు.

ఆపైన మనుషులు ఆగలేదు. కాళ్ళు కదిలాయి. కొడుకు వళ్ళంతా నెత్తురు. రావడి బట్టలమీద నెత్తురు. సూర్యుడి చేతుల్నిండా నెత్తురు.

రావడి కళ్ళలో ప్రాచీన గంగ, పాతాళ గంగ బుడబుడ లాడినట్లు అయింది. చెమ్మ! తడి! సొన! వాన! కుండపోత! కన్నీరు! నెత్తురు! నెత్తుటి కన్నీరు! కన్నీటి నెత్తురు! చిత్రం! రావడి కళ్ళలో నీళ్ళు.

తీరుబడిగా గోయి తవ్వాడు. తీరికగా కొడుకును పడుకోబెట్టాడు. ముఖం తుడిచాడు. మట్టివేశాడు. పూడ్చాడు.

ఈ శవం మంచి ఎరువు. పొలం బాగా పండుతుంది. ఊరు తింటుంది పీనిగకూడు.

చాలారోజులు సూర్యుడు పొలంలోనే పుట్టాడు. అక్కడే చచ్చాడు. పల్లె వల్లకాడుగా, ఇల్లు శవం పెట్టెగా వుంది.

రావడు పొలంలో పాక వేసుకొన్నాడు. మూడు బొంగులు, మోపుగడ్డి.

ముంతా, మూకుడు, చట్టి, పిడత, కుండ, సామాన్లు. నరాల్లో చలి, వణుకు. ఎముకల్లో నిప్పు, మంట, రావడి జబ్బులు.

కర్మ సాక్షి నడినెత్తిమీద కబుర్లు చెబుతూంటే చింతయ్య వచ్చి చావు కబురు చల్లగా చెప్పాడు. "ఈ పొలం నాది".

"ఎట్టా?" అనాల్సింది రావడు. అన్లేదు.

"ఏందీ?" అంటూ చూడాల్సింది. చూళ్ళేదు.

మౌనం.

ఎప్పుడో తీసుకొన్న అప్పు. వందరూపాయలు. వేలు దాటింది. వేలు ముద్రలు దాటింది. కోర్టుకు పోయింది. స్టాంపుకు ప్రాణం వచ్చింది. నడిచి పొలంలోకి వచ్చింది.

నిలబళ్ళేకపోయాడు. కూలబడ్డాడు. కూర్చోలేకపోయాడు. వాలిపోయాడు. నేలను వాటేసుకొన్నాడు. బిడ్డల్ని, బంధువుల్ని, తల్లిని, తండ్రిని వాటేసుకొన్నట్లు పొలాన్ని కౌగిలించుకున్నాడు.

నోట్లో దుమ్ము.

చింతయ్య రావణ్ణి పొలంలోంచి అవతలికి ఈడ్చాడు.

తన వొంట్లో ఉన్న నెత్తురూ చెమటా పీల్చుకొన్న పొలం కాలు కదపకుండా కూర్చుంది.

కొడుకును పొట్టన పెట్టుకొని నోరెత్తకుండా వుంది.

కర్మసాక్షి మాత్రం వీపు చరుస్తున్నాడు.

రావడు పుట్టటమే తలక్రిందులుగా పుట్టాడు. పెరగటం తలవంచుకొని పెరిగాడు. వయస్సు పైబడ్డకొద్దీ తలనేలకు దగ్గరయింది. ఇప్పుడు నేల పాలయింది.

నమ్ముకొన్నందుకు వళ్ళంతా నోరంతా బురదరాసి నేల కనికరించింది.

మెల్లగా కూర్చుని, మోకాళ్ళ మీద చేతులు పెట్టుకొని, నడుం పట్టుకొని, వెన్నెముక రాసుకొని రావడు నిలబడ్డాడు.

వంగి చేసే పనిలేక రావడు నిలబడ్డాడు.

నిలబడుతుంటే వెన్నెముక కరకరలాడింది. పెటపెటలాడింది. మూలిగింది. అరిసింది.

వంగిపోయిన తల లేవటానికి మొండికేసింది. బిగిసింది. పట్టింది. మెల్లగా చుట్టూ చూశాడు. గబగబా చూశాడు. అన్ని దిక్కులు చూశాడు.

ఎంత సంతోషం. నేల, నింగి, దిగంతాలు భూమి ఎంత అందమయిందీ, ఎంత విశాలమయిందీ – ఈ భూమ్మీద తాను పుట్టాడు. పెరిగాడు. ఎంత అదృష్టం.

పీల్చిన గాలి – గుండె బంధువు – ఎంత హాయిగా వుంది!

నడిచాడు. అడుగు వేస్తే కాలికెంత బలం! ఎంత ఆనందం! ఇంతకాల తాను కోల్పోయిందేమిటో రావడికి తెలియటం మొదలయింది.

తన పొలంవైపు చూశాడు. వళ్ళు స్వాధీనం తప్పుతూ ఉంది. పల్లెలో పేరుకు ఇల్లుంది.

వారంపాటు సూర్యుడు రాత్రీ, పగలూ ఆ యిల్లు వదల్లేదు. ఈ వారం రావడికంటి మీద కునుకులేదు.

ఆ రోజు ఉదయం రావడు ఊరు చెరువు గట్టుమీద పుట్టాడు. పుట్టీ పుట్టకముందే సూర్యుడు ఊరు చెరువులో పడి తన్నుకులాడుతున్నాడు. ఎవడీ సూర్యుణ్ణి కాపాడేది?

ఉదయం కాంతిలో చెరువు గట్టుమీంచి రావడు ఊరంతా పరికించాడు.

వింత – కొత్తగా కనిపించింది.

చిత్రం – అసహ్యం పుట్టింది.

విచిత్రం – కసి.

చీకటి పడింది. జేబులో అగ్గిపెట్టె చేతికి తగిలింది. గల గల లాడింది. తీసి గీశాడు. ఆ వెలుతురులో రావడి ముఖం కనబడింది. ఇది మునుపటిది కాదు.

కుంకిన సూర్యుడు రావడి ముఖంలో అర్ధరాత్రి పుట్టాడు. ఎర్రగా మంటగా జ్వాలగా ముఖం. సూర్యుడు మండిపోతున్నాడు.

అగ్గిపెట్టె గట్టిగా పట్టుకొని రావడి గావుకేక పెట్టాడు. చెరువు ప్రతిధ్వనించింది. మాట వినబళ్ళేదు. చిత్రం. రావడు మాట్లాడుతున్నాడు.

చెరువుగట్టు దిగి ఊళ్ళోకి పోతూ అరిచాడు.

"ఈ బతుకు లిట్టా తగలబడ్డానికి ఈల్లేదు. ఈ బతుకులిట్టా తగలబడ్డానికి ఈల్లేదు. ఈ బతుకులిట్టా తగలబడ్డానికి ఈల్లేదు".

✦